

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 35.0 । కనిష్ఠం : 25.0



సలేశ్వరం దారిలో నిలిచిపోయిన వాహనాలు

రైతు భరోసా
సా..గదీత!



- మార్చి 31 వరకే పెట్టుబడి సాయం పూర్తి చేస్తామన్న ప్రభుత్వం
- ఇప్పటి వరకు నాలుగు ఎకరాల్లోపు భూమి ఉన్న వారి ఖాతాల్లోనే డబ్బులు జమ
- ఉమ్మడి జిల్లాలో రూ.1,358 కోట్లకు గాను అందింది రూ.830 కోట్లే..
- ముంచుకొస్తున్న మరో సీజన్
- ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లపై ఫోకస్..

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతులు పెట్టుబడి కోసం అప్పులు చేసి.. దిగుబడి లేకనో, ధర రాకనో నష్టం వస్తే ఆ అప్పు తీర్చలేక ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గత ప్రభుత్వం రైతుబంధు పథకానికి శ్రీకారం చుట్టింది. ఎకరాకు రూ.5 వేల చొప్పున ఏడాదికి రూ.10 వేలు ఇచ్చింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఒక విడత రైతుబంధు పేరుతోనే పెట్టుబడి సాయం అందజేయగా తరువాత సీజన్‌లో సాయం ఇవ్వలేదు.



నారాయణపేట జిల్లా మరికల్ మండలం పూసల్‌పహాడ్‌లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

రైతు భరోసా పథకం అమలు కోసం మార్గదర్శకాలు సిద్ధం చేయడంలో ఆలస్యం జరగడం అందుకు ఒక కారణం. అయితే ఆ తరువాత ప్రస్తుత యాసంగి సీజన్‌కు సంబంధించి రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేల చొప్పున ఇవ్వాలని నిర్ణయించింది. జనవరి 26న సీఎం రేవంత్ రెడ్డి పథకాన్ని ప్రారంభించారు. మార్చి 31వ తేదీ వరకు పంటలు సాగు చేసిన ప్రతీ ఒక్కరి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని ప్రకటించారు. ఆ గడువు ముగిసి కూడా 12 రోజులు గడుస్తోంది. కానీ ఇప్పటి వరకు నాలుగు ఎకరాల్లోపు రైతులకు మాత్రమే డబ్బులు జమ చేశారు. మిగిలిన వారంతా ఆ సాయం ఎప్పుడు అందుతుందా? అని ఎదురు చూ స్తున్నారు. ఇప్పటికే భరోసా పేరుతో ఒక సీజన్‌లో డబ్బులు రాలేదు. కానీ ఆ సమయంలో అందరికీ రుణ మాఫీ కావడంతో రైతుల నుంచి కూడా పెద్దగా నిరసన రాలేదు. కానీ ప్రస్తుత సీజన్‌లో నగదు జమ కాకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యాసంగి సీజన్ ముగిసి, మరో సీజన్ వస్తుండడంతో డబ్బులు ఎప్పుడు వేస్తారని అడుగుతున్నారు.

జిల్లాల వారీగా రైతు భరోసా డబ్బులు అందిన, అందని రైతుల వివరాలు

జిల్లా	చెల్లించాల్సింది	రైతులు	చెల్లించింది	రైతులు
మహబూబ్ నగర్	229.73	214800	160.81	188905
నాగర్‌కర్నూల్	436.18	330836	247.39	247223
వనపర్తి	215.94	195164	132.88	153409
నారాయణపేట	240.42	175343	147.41	142909
జోగులాంబ	236.69	165763	142.28	134400

రూ.830 కోట్లు మాత్రమే జమ..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైతు భరోసా కింద రూ.1,358 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయాలని అధికారులు ట్రెజరీకి పంపించారు. కానీ ఇప్పటి వరకు రూ.830 కోట్లు మాత్రమే జమ అయ్యాయి. ఇంకా రూ.528 కోట్లు జమ చేయాల్సి

(మిగతా 6లో..)

దర్శనమిచ్చిన సలేశ్వరుడు

- అన్ని దారులు అటవీ మార్గం వైపే..
- నిబంధనలు పాటించాలంటున్న అధికారులు

అచ్చంపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఏటా చైత్ర పౌర్ణమికి భక్తులకు దర్శనమిచ్చే సలేశ్వరం లింగమయ్య స్వామిని దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట తదితర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తుంటారు. శుక్రవారం నుంచి అటవీ దారులు తెరుచుకోవడంతో పెద్ద సంఖ్యలో భక్తులు, పర్యాటకులు తరలి వెళుతున్నారు. పరహాబాద్ చౌరస్తా నుంచి దాదాపు 18 కిలోమీటర్ల దూరం దట్టమైన అటవీ మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది. రాంపూర్ పెంట వరకు వాహనాలలో వెళ్లి అక్కడి నుంచి మోకాళ్ల కురువ ప్రాంతం వరకు ఆటోలో వెళ్తారు. అక్కడినుంచి కాలినడకన మహిమాన్విత లింగమయ్య స్వామిని దర్శించుకుంటున్నారు. మొదటి రోజు అన్నిదారులు సలేశ్వరం వైపే అన్నట్లుగా పెద్ద ఎత్తున ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, బస్సులు తరలివెళుతున్నాయి. అధికారులు దీనికి అనుగుణంగా ఏర్పాట్లను చేశారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పరహాబాదు, రాంపూర్, మోకాళ్ల కురువ వద్ద ప్రత్యేక శిబిరాలను

(మిగతా 6లో..)



లింగమయ్య స్వామి మూలవిరాట్



భక్తులతో మాట్లాడుతున్న డీఈ హేమలత



సలేశ్వరం దారిలో భక్తులు



సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

6

ఏపీ ప్రాజెక్టులతో రాష్ట్రానికి తీవ్ర నష్టం

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

- రూ. 2.5 కోట్ల వ్యయంతో సీటీ స్కాన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



సీటీ స్కాన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రికి రూ. 2.5 కోట్ల వ్యయంతో నూతన సీటీ స్కాన్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కలెక్టర్ బీఎం సంతోష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందాలన్న దృష్టితో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. గద్వాల ప్రాంతంలో నిరుపేద ప్రజలు సీటీ స్కాన్ కొరకు కర్నూల్, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు పెట్టుకొని రావాల్సి వస్తుండేదని, అయితే ఇక ఆ సమస్య ఉండదన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు, ఎమ్మెల్యే సహకారంతో సీటీ స్కాన్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన రోగనిర్ధారణ సేవలను అందించడానికి అత్యాధునిక కంప్యూటర్స్ టోమోగ్రఫీ, సీటీ స్కాన్ యంత్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిర, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, జడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్, గ్రంథాలయ మాజీ చైర్మన్ రామన్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీధర్‌గౌడు, జములమ్మ ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రాములు, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ బాబర్, కాంగ్రెస్ నాయకులు చిరు, వంట భాస్కర్, డాక్టర్లు ఉన్నారు.

ఫూలే జీవితం ఆదర్శం

- ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో ఫూలే చిత్ర పటానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ, కలెక్టర్



నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో జ్యోతిరావు ఫూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహానుభావుడు మహాత్మా జ్యోతిరావు ఫూలే జీవితం అందరికీ ఆదర్శమని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మహాత్మా జ్యోతిరావు ఫూలే 199వ జయంతిని బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డితో పాటు కలెక్టర్ బదావత్ సంతోష్ హాజరై ఫూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ చదువుతోనే సమ సమాజ స్థాపన సాధ్యమని నమ్మిన ఫూలే దంపతులు పాఠశాలలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పారని పేర్కొన్నారు. ఫూలే ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్సీ ఆకాంక్షించారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారంటే ఫూలే చేపట్టిన సంస్కరణలే అన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్, బీసీ సంక్షేమశాఖ అధికారి ఖాజా నజీం అలీ అఫ్సర్, డీఎస్పీ శ్రీనివాసులు, బీసీ సంఘాల నాయకులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అద్దె వాహనాల టెండర్లు రద్దు

- సాంకేతిక కారణాలతో బస్సుల టెండర్లు 15 వరకు వాయిదా
- అధికారులు నిజాయతీపరులంటున్న కాంట్రాక్టర్లు
- మౌనం వీడని ఈగలపెంట జెన్‌కో అధికారులు

6

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఈగలపెంట శక్తిసదన్ కార్యాలయం వద్ద జెన్‌కో కాంట్రాక్టర్ల బృందం

ఎస్‌ఎల్‌బీసీ ఘటనకు నేటితో 50 రోజులు

- దొరకని మరో ఆరుగురి ఆచూకీ
- ఈ నెల 20లోగా మట్టి తరలింపు ప్రక్రియ పూర్తవుతుందని ఆశాభావం
- గల్లంతైన వారి ఆచూకీ కనుగొనేంత వరకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగింపు

6



సొరంగం నుంచి టన్నెల్ బోరింగ్ మిషన్ శిథిలాలు, మట్టిని తొలగిస్తున్న సహాయక బృందాలు

భూసారం తెలిసేదెలా?



యాదిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో రైతులు సాగు చేస్తున్న వరి పంట

- మూడేళ్లుగా నిలిచిపోయిన పరీక్షలు
- నేల స్వభావం తెలియక నష్టపోతున్న రైతులు

తాడూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : నేల స్వభావం ఏంటి? ఏ పంటలు పండుతాయి? ఏ ఎరువులు ఏ మోతాదులో వేసుకోవాలి? తదితర వివరాలు భూసార పరీక్షల ద్వారానే తెలుస్తాయి. ఈ పరీక్షల ఆధారంగా రైతులు పంటలను సాగు చేస్తే ఆశించిన దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుంది. కానీ, మూడేళ్లుగా తాడూరు మండలంలో భూసార పరీక్షలు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. తాడూరు మండల కేంద్రంతో పాటు మండలంలోని 7 క్లస్టర్ల పరిధిలో 24 గ్రామ పంచాయతీలున్నాయి. మొత్తం 11,700 మంది రైతులకు సంబంధించి 45 వేల ఎకరాల సాగు యోగ్యమైన భూమి ఉంది. మూడేళ్ల క్రితం క్రేంద ప్రభుత్వం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ ద్వారా భూసార పరీక్షలు నిర్వహించారు. ఈ తర్వాత ఇప్పటి వరకు పరీక్షలు నిలిచిపోయాయి. ఆసక్తి ఉన్న రైతులు తమ పొలాల్లో మట్టి నమూనాలను సేకరించి, పాలెం కృషి విజ్ఞాన కేంద్రానికి తీసుకెళ్తే, అక్కడ భూసార పరీక్షలు నిర్వహించి, ఫలితాలు వెల్లడిస్తారని అధికారులు చెప్తున్నారు. కానీ ఎక్కువ మంది రైతులు అందుకు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి స్థానికంగా భూసార పరీక్షలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

గత సంవత్సరం ఇంద్రకల్‌లో పాలెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న అధికారులు (ఫైల్)



భూసారం తెలిస్తే సాగు లాభదాయకం



భూసార పరీక్షలు నిర్వహించి, వివరాలు వెల్లడిస్తే సాగు సులభతరం అవుతుంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చు. ప్రభుత్వం అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ శాఖ అధికారులు రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయించాలి.

- శంకర్‌గౌడ్, రైతు, ఎట్టిధార్‌పల్లి

వ్యవసాయ శాఖ అధికారులు స్పందించాలి



భూసార పరీక్షలపై వ్యవసాయ శాఖ అధికారులు స్పందించాలి. ఈ పరీక్షల ద్వారా నేల స్వభావం తెలుస్తుంది. అందుకు అనుగుణంగా పంటలు సాగు చేస్తే ఎక్కువ దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసు కోవాలి.

- జానకిరాంరెడ్డి, రైతు, భలాన్‌పల్లి

ప్రస్తుతం వెసులుబాటు లేదు



ప్రస్తుతం ప్రభుత్వ పరంగా మండలంలో ఎలాంటి భూసార పరీక్షలు నిర్వహించడం లేదు. ఆసక్తి ఉన్న రైతులు పాలెం కృషి విజ్ఞాన కేంద్రానికి మట్టి నమూనాలను తీసుకెళ్లి పరీక్షలు చేయించుకోవచ్చు. ప్రస్తుతం స్థానికంగా ఆ వెసులుబాటు లేదు. వస్తే రైతులకు సమాచారం అందిస్తాం.

- సందీప్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి, తాడూరు

రైతు భరోసా సా..గదీత

(5వ పేజీ తరువాయి)

ఉంది. ఇప్పటి వరకు నాలుగు ఎకరాల్లోపు వారికే డబ్బులు అందాయి. అందులో మెజారిటీ సన్నకారు రైతులే ఉన్నారు. అయితే భూమిపై ఎలాంటి సీలింగ్‌ను ప్రభుత్వం విధించలేదు. కేవలం సాగు యోగ్యం కానీ, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న భూములను అందులో నుంచి మినహాయించింది. ఉమ్మడి జిల్లాలో 24.71 లక్షల ఎకరాలను గుర్తించారు. పాత జాబితాలో 33,182 ఎకరాలు సాగుకు యోగ్యం కాదని తొలగించారు. వాటికి భరోసా వేయలేదు. అయితే ఇంకా ఆలస్యం అవుతుండడంతో ప్రభుత్వంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నిధులలేమి సమస్యతో పథకాలు అందకపోగా, మెజారిటీ వర్గానికి ఉపయోగపడే రైతు భరోసాపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

కొనుగోళ్లపై ఫోకస్

యాసంగి కోతలు ప్రారంభ మయ్యాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తోంది. ప్రభుత్వం కూడా కొనుగోళ్లపై ఫోకస్ పెట్టి, కేంద్రాలను ప్రారంభిస్తోంది. ఇప్పుడు ఆ ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రభుత్వానికి నిధులు అవసరం. అలాగే సన్న బియ్యం పంపిణీ ప్రారంభమైన నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్ల కోసం రైతులకు బోనస్ ఇవ్వాలి. గత సీజన్‌లో బోనస్ పూర్తి చేయడానికి చాలా సమయం పట్టింది. ఈ నేపథ్యంలో అటు రైతు భరోసా, ధాన్యం కొనుగోలు, సన్నాలకు బోనస్ అందుతాయా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఈ యాసంగి సీజన్‌కు సంబంధించి 10.05 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం పెట్టుకోగా, అందు కోసం 1,002 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఆ మొత్తం ధాన్యం కొనుగోలు చేస్తే బోనస్ కాకుండానే రూ.2,300 కోట్లు అవసరం కానున్నాయి.

నేటి నుంచి ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నీ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12, 13 తేదీల్లో ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహించనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియంలో నిర్వహించనున్న ఈ టోర్నీకి జిల్లా జట్టుతో పాటు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్టణం (వైజాగ్), నెల్లూరు ఏపీ స్పోర్ట్స్ స్కూల్ పూర్వ విద్యార్థులు మొత్తం 80 మంది క్రీడాకారులు హాజరుకానున్నారు. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో 6 మ్యాచ్‌లను నిర్వహించనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి భానుకిరణ్ తెలిపారు. ముఖ్య అతిథులుగా ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్, ఉపాధ్యక్షులు రంగారావు, రాయల రమేశ్, శంకర్‌లింగం, ప్రేమ్‌రాజ్ హాజరు కానున్నట్లు చెప్పారు.

టోర్నీ నిర్వహణ ఏర్పాట్లను శుక్రవారం సెక్రటరీ భానుకిరణ్‌తో పాటు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇమ్మా నుయేల్ జేమ్స్ పరిశీలించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రామకృష్ణ, శశిధర్, రాజశేఖర్, నగేశ్, కే.రవీందర్ పాల్గొన్నారు.

ముగిసిన సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

చారకొండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలోని సిరసనగండ్ల క్షేత్రంలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ నెల 5న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలకు వేలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం ఉదయం స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ముక్కిడి పోచమ్మ, శివదత్తాత్రేయ, పరశురామ ఆలయాల్లో దేవాలయాల్లో అర్చనలు చేశారు. అనంతరం స్వామి వారికి పల్లకిసేవ, చక్రతీర్థం, ద్వాదశ ఆరాధన, ఏకాంతసేవలతో బ్రహ్మోత్సవాలు ముగిశాయని ఆలయ చైర్మన్ డేరం రామశర్మ, ఈవో ఆంజనేయులు తెలిపారు. బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా కొనసాగేలా కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ శంషోద్దీన్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నిరంజన్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా పంబ ఆరట్టు

- చిలమేశ్వర దేవాలయం ఊటబావిలో నిర్వహణ
- తరలివచ్చిన అయ్యప్ప స్వామి భక్తులు



చిలమేశ్వర దేవాలయంలోని ఊటబావిలో చక్రస్నానం అచరిస్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఏప్రిల్, 11 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప స్వామి జన్మదినం, ఉత్తర నక్షత్రాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన పంబ ఆరట్టు (చక్రస్నానం) కార్యక్రమం కనుల పండువగా కొనసాగింది. అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో మౌంట్ బేసిల్ పాఠశాల పక్కనున్న చిలమేశ్వర దేవాలయ ప్రాంగణంలోని ఊట బావిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పడి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల శరణుఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. శబరిమలలో నిర్వహించినట్లుగానే పాలమూరు పట్టణంలో తొలిసారి నిర్వహించిన పంబ ఆరట్టు కార్యక్రమానికి మహబూబ్‌నగర్ పట్టణ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు సీమ నరేందర్ మాట్లాడుతూ పాలమూరు అయ్యప్ప సేవలో ఈ కార్యక్రమం అద్భుత ఘట్టమన్నారు. అనంతరం భక్తులందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇరువెంటి శ్రావణ్ శర్మ, మోనేష్, పవన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రావులపల్లిలో తాగునీటి సమస్య



ఖాళీ బిందెలతో రోడ్డు మీదకు వచ్చిన గ్రామస్థులు

భూత్పూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రావులపల్లిలో వారం రోజుల నుంచి తాగునీరు సరఫరా కావడం లేదని, ఎండాకాలంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఏర్పడిందని ఆరోపిస్తూ శుక్రవారం గ్రామస్థులు ఖాళీ బిందెలతో రోడ్డు మీదికి వచ్చారు. ఈ సందర్భంగా దాదాపు గంట సేపు గ్రామంలో ఉన్న రచ్చకట్ట వద్దకు చేరుకొని మహిళలు మాజీ ప్రజాప్రతినిధులతో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని నిలదీశారు. మాజీ సర్పంచ్ శ్రీనయ్య మండల స్థాయి అధికారులతో మాట్లాడగా స్పందించిన ఎంపీడీవో ప్రభకార్‌చారి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ సహాయంతో తాగునీటి సమస్యను పరిష్కరించారు. పైపులైన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టను న్నట్లు ఎంపీడీవో వివరించారు.

అద్దె వాహనాల టెండర్లు రద్దు

- టెండర్ల నిర్వహణలో సాంకేతిక కారణాలతో బస్సుల టెండర్లు 15 వరకు వాయిదా
- అధికారులు నిజాయతీపరులంటున్న కాంట్రాక్టర్లు
- మౌనం వీడని ఈగలపెంట జెన్‌కో అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దోమలపెంట ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో "అద్దె వాహనాల టెండర్లు, నామినేషన్ వర్క్‌ల కేటాయింపులలో జెన్‌కో అధికారుల ఇష్టారాజ్యం", "ఆన్‌లైన్ టెండర్లకు అధికారుల మంగళం" అనే వరుస శీర్షికలు 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో వెలువడ్డాయి. దీంతో హైదరాబాద్ విద్యుత్ సౌధ నుంచి ఉన్నతాధికారుల ఒత్తిడితో శుక్రవారం జరగాల్సిన వాహనాల టెండర్లను ఈగలపెంట జెన్‌కో సీఈ కార్యాలయ అధికారులు రద్దు చేశారు. ఇకపై జరుగనున్న అద్దె వాహనాలు, ఇతర పనులకు సంబంధించిన టెండర్లను ఆఫ్‌లైన్‌లో కాకుండా ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు గురువారం రాత్రి స్థానిక జెన్‌కో ఉన్నతాధికారులు సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం. ఈగల పెంట జెన్‌కో అధికారులపై అవి నీతి ఆరోపణలు వస్తున్న ఏ ఒక్క అధికారి దీనిపై స్పందిం చక పోవడంతో స్థానికంగా చర్చనీయంగా మారింది.

బస్సులు, కార్లకు టెండర్లు రద్దు

శుక్రవారం వోఅండ్‌ఎం (ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్) విభాగంలో రెండు బస్సులు, ఒక కారు, సివిల్ విభాగంలో ఒక కారుకు సంబంధించి ఆఫ్‌లైన్ టెండర్లలో అవకతవకలు జరుతున్నాయని దోమలపెంటకు చెందిన ఎడ్ల శేఖర్ అనే కాంట్రాక్టర్ కోర్టును ఆశ్రయించాడు. దీంతో జెన్‌కో యాజమాన్యం టెండర్ల నోటిఫికేషన్‌లో సాంకేతిక లోపాలున్నాయని కోర్టులో మొరపెట్టుకోగా, వాదనలు విన్న న్యాయాధికారి కేసును కొటివేశారు. టెండర్లను రద్దు చేయాలని జెన్‌కో యాజమాన్యాన్ని ఆదేశించారు. అలాగే, బస్సుల కేటాయింపులో ఎస్‌టీలకు 50 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని మరో కాంట్రాక్టర్ చత్రునాయక్ కోర్టును ఆశ్రయించగా కేసును ఈనెల 15 వరకు వాయిదా వేసింది.

జెన్‌కో అధికారులు నిజాయతీపరులు

ఈగలపెంట జెన్‌కో అధికారులపై స్థానిక కాంట్రాక్టర్ ఎడ్ల శేఖర్ చేస్తున్న అవినీతి ఆరోపణలో వాస్తవం లేదని దోమలపెంటకు చెందిన పలువురు కాంట్రాక్టర్లు శుక్రవారం విలేకరుల తో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెన్‌కో సంస్థలో ఐదు లక్షలు దాటిన పనులను ఆన్‌లైన్‌లో టెండర్లు పిలుస్తున్నారని, నిజాయితీ గల అధికారులపై అవాస్తవమైన ఆరోపణలు కాంట్రాక్టర్లుగా తాము ఖండిస్తున్నామన్నారు. వాహనాల టెండర్లలో ఎటువంటి అవకతవకలు జరుగుతలేవని, నిబంధనల ప్రకారమే టెండర్ల విధానం జరుగుతున్నా, మిగతా కాంట్రాక్టర్లు ఏ అ ధికారికి కమీషన్‌లు ఇచ్చారో రుజువు చేయాలని పేర్కొంటున్నారు. అతనిపై జెన్‌కో అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు. ఖాజా మొయిజోద్దీన్, ముత్తుస్వామి కుమార్, ఊట్కూరు మల్లికార్జున్, జెడ్డా గురు వయ్య, అంజయ్య, సీతరాల రవికుమార్ గౌడ్, మెగావత్ వెంకటేష్, బెజ్జం మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

ఏపీ ప్రాజెక్టులతో రాష్ట్రానికి తీవ్ర నష్టం

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ (ఎస్‌ఆర్‌ఎంసీ) లైనింగ్ పనులతో పాటు, కృష్ణానదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టుల మూలంగా రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీశైలం కుడి ప్రధాన కాలువ పనులను ఏపీ ప్రభుత్వం చేపట్టడంతో దాని సామర్థ్యం 44 వేల నుంచి 89,672 క్యూసెక్కులకు పెరుగుతుందన్నారు. దీంతో శ్రీశైలం జలాశయం నుంచి ఎక్కువ నీటిని రాయల సీమ ఎత్తిపోతల పథకంతో పాటు ఇతర ప్రాజెక్టుల కు తరలించే అవకాశం ఉందని తెలిపారు. ఇది కృ ష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులు నాగార్జునసాగర్, కల్వ కుర్తి ఎత్తిపోతల, పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపో తల పథకాలకు నీటి లభ్యత తగ్గుతుందన్నారు. వ ర్షాభావ సమయాల్లో రాష్ట్రంలోని రైతులు సాగునీటి కొరతను ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. అలాగే శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వ తగ్గడంతో రాష్ట్రం లో విద్యుత్ ఉత్పాదన, ఇతర నీటి ఆధారిత కార్యక లాపాలు పూర్తిగా దెబ్బ తింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు కృష్ణానది జలాల పంపిణీలో కీలకమైనదని, ఈ తీర్పు తె లంగాణకు అనుకూలంగా వస్తుందని భావిస్తూ ఏపీ ప్రభుత్వం కెనాల్ లైనింగ్ పనులను నిబంధన లకు విరుద్ధంగా చేపడుతోందని విమర్శించారు. ఏపీ లో అధికారంలో ఉన్న టీడీపీ రాయలసీమ ప్రాం తంలో రాజకీయంగా బలపడడం కోసం, నీటి లభ్య తను పెంచే ప్రాజెక్టును వేగవంతం చేయాలని భావిస్తుందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మనుగడ టీడీపీ మద్దతుపై ఆధారపడిన నేపథ్యంలో, దాన్ని అవకాశంగా తీసుకొని చంద్రబాబు ప్రభుత్వం జల దోపిడీకి పాల్పడుతోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయంలో ని మ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం దారుణమ న్నారు. రాష్ట్ర ఎమ్మెల్యేలకు ప్రాజెక్టులపై అవగాహన లేదని, ఏం జరుగుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. స్థానికంగా ఉండే మంత్రితో పాటు, ఎమ్మెల్యేలకు సోయి కూడా లేదని విమర్శించారు. ఇప్పటికే 90 శాతం పూర్తయిన పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ. 1000 కోట్లు కేటాయిస్తే ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం అవుతుందన్నారు. ఆ విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమావేశంలో నాయకులు గట్టు యాదవ్, శ్రీధర్ పాల్గొన్నారు.

దర్శనమిచ్చిన సలేశ్వరుడు



లోయలో భక్తుల బారులు

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు మహిళలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేశారు. మోకాళ్ల కురువ సమీపంలో అన్నప్రసాదాల పంపిణీకి వివిధ స్వచ్ఛంద సంస్థల వారు ఏర్పాట్లు చేశారు.

నిబంధనలు పాటించాలంటున్న అటవీశాఖ


నల్లమల అభయారణ్యంలో ప్రయాణించాలంటే అటవీశాఖ నిబంధనలు పాటించాలని అటవీశాఖ భక్తులకు పలు సూచనలు చేస్తున్నది. అటవీ మార్గంలో ప్లాస్టిక్ బాటిళ్లు వేయరాదని, మద్యం సేవించడం ధూమపానం చేయడం వంటివి నిషేధం. జంతువులకు హాని తలపెట్టే కార్యక్రమాలు చేయరాదని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. 3 రోజులు జరిగే ఉత్సవాలకు అడవి మార్గంలో వెళ్లాలంటే ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. వరహాబాదు చౌరస్తా నుంచి ట్రాక్టర్, కారుకు 600 ఆటోకు 200, ద్విచక్ర వాహనానికి 100,డీసీఎం, ప్రైవేటు బస్సులకు 1000 చొప్పున ఎంట్రీ ఫీజు అటవీ శాఖ సిబ్బంది డబ్బులు వసూల్ చేస్తున్నారు.



రాళ్లను దాటుకుంటూ వెళ్తున్న భక్తులు

ఎస్‌ఎల్‌బీసీ ఘటనకు నేటితో 50 రోజులు

- దొరకని మరో ఆరుగురి ఆచూకీ
- ఈ నెల 20లోగా మట్టి తరలింపు పూర్తవుతుందని ఆశాభావం
- గల్లంతైన వారి ఆచూకీ కనుగొనేంత వరకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగింపు



ఎస్‌ఎల్‌బీసీలో డేంజర్ జోన్ వద్ద బిగించిన కంచె (ఫైల్)

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ఎడమగట్టు సొరంగంలో దుర్ఘటన జరిగి నేటికీ 50రోజులు పూర్తవుతోంది. ఎస్‌ఎల్‌బీసీలో టన్నెల్ బోరింగ్ మిషన్ ద్వారా తవ్వకాలు చేపడుతున్న క్రమంలో ఫిబ్రవరి 22న ఉదయం 8 నుంచి 8:3గంటల సమయంలో ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. మొదటి షిఫ్టులో 52మంది పనుల కోసం ఇన్‌లెట్‌లోకి వెళ్లగా పైకప్పు కూలడంతో ప్రాణభయంతో కార్మికులు పరుగులు పెట్టారు. ఈ ఘటన నుంచి 44మంది కార్మికులు సురక్షితంగా తప్పించుకోగా జేపీ అసోసియేట్, ర్యాబిన్స్ కంపెనీకి చెందిన 8మంది అందులోనే చిక్కుకున్నారు. మనోజ్‌కుమార్, శ్రీనివాస్, సందీప్‌సాహు, జగితాస్, సంతోష్ సాహు, సంజుసాహు, సన్నీసింగ్, గురుప్రీత్‌సింగ్‌లు ఆచూకీ లేకుండాపోయింది. వీరిలో గురుప్రీత్‌సింగ్, మనోజ్‌కుమార్‌ల మృతదేహాలు లభ్యమైన విషయం తెలిసిందే.

ప్రతికూలతను అధిగమిస్తూనే...

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలను చేపట్టేందుకు రెస్క్యూ టీమ్‌కు అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఆర్మీ, నేవీ, సింగరేణి, దక్షిణ మధ్య రైల్వే, ర్యాట్ హోల్ మైనర్స్, కేరళకు చెందిన క్యాడేవర్ డాగ్స్ బృందం గల్లంతైన వారి ఆచూకీ కనుగొనేందుకు నిరంతరం శ్రమించారు. అయితే ఎస్‌ఎల్‌బీసీలో ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భూమి అంతర్భాగానికి సంబంధించిన అనేక పొరల్లో వ్యత్యాసాలు ఉండటాన్ని పూర్తిగా అధ్యయనం చేస్తున్నాం. ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని రక్షించే క్రమంలో సహాయక సిబ్బందికి ఎలాంటి హాని జరగకుండా ప్రత్యామ్నాయ వ్యవస్థను రూపొందించే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది.

ఈ నెల 20లోగా డేంజర్ జోన్ వరకు మట్టి తోడివేత పూర్తి?

ఎస్‌ఎల్‌బీసీ ఆపరేషన్‌ను త్వరితగతిన పూర్తి చేసి గల్లంతైన వారి ఆచూకీ కనుగొనేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టిన యంత్రాంగం ఈ నెల 20లోగా రెస్క్యూ ఆపరేషన్‌ను పూర్తి చేసే దిశగా అడుగులు వస్తోంది. ఈ క్రమంలో 7షిఫ్టుల్లో 520మంది కార్మికులు నిర్విరామంగా శ్రమిస్తూ మట్టి, టన్నెల్ బోరింగ్ మిషన్ శిథిలాలను వేగంగా బయటకు పంపే ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ప్రమాదం జరిగిన రోజు సహాయక చర్యలు చేపట్టినప్పుడు నిమిషానికి 10వేల లీటర్ల నీరు టన్నెల్లో ప్రవహించింది. 125మీటర్ల పొడవు 1500టన్నుల బరువు ఉన్న టన్నెల్ బోరింగ్ మిషన్ ఎస్‌ఎల్‌బీసీ పైకప్పు కూలిన ఘటనలో దాదాపు 50 నుంచి 60మీటర్లు వెనక్కి వచ్చింది. టీబీఎం శిథిలాలన్నీ టన్నెల్‌కు ఇరువైపులా అడ్డంగా ఉండి సహాయక చర్యలు చేపట్టలేని పరిస్థితి ఒక వైపు, కన్వేయర్ బెల్టు పని చేయకపోవడం, లోకో ట్రైన్ వ్యవస్థ కూడా నిర్వీర్యం అయ్యాయి. దీంతో ప్లాస్మా కట్టర్లు, సింగరేణి కార్మికులు టీబీఎం శిథిలాలను దాదాపు 10కిలో మీటర్లు మోసుకొని వచ్చి బయటకు చేర్చారు. దేశంలోని నిపుణులందరిని పిలిపించి వారి సలహాలు, సూచనలు తీసుకున్న తర్వాత ఇప్పుడిప్పుడే సహాయక చర్యలు ముమ్మరమయ్యాయి. అయితే ఈ నెల 20 లోగా డేంజర్ జోన్ వరకు చేరుకోగలుగుతామనే ఆశాభావంలో రెస్క్యూ టీమ్ ఉంది.

20 తర్వాత పరిస్థితి ఏమిటీ?

గడిచిన 50రోజులుగా నిర్విరామంగా సహాయక చర్యలు చేపడుతున్న రెస్క్యూ సిబ్బందికి ఏదో మూల ఆశలు సజీవంగా ఉంటున్నాయి. డేంజర్ జోన్ వరకు మట్టితోడివేత పనులు పూర్తయ్యాక పరిస్థితి ఏంటనే అంశంపై అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సహాయక చర్యలు అనేక షిఫ్టుల్లో చేపడుతున్నందున డేంజర్ జోన్‌కు మించి ముందుకెళ్లకుండా కంచె ఏర్పాటు చేశారు. ఇదంతా టన్నెల్ బోరింగ్ మిషన్‌కు ఎదురు భాగంలో ఉంది. ఇప్పటి వరకు టీబీఎం శిథిలాల తొలగింపు ప్రక్రియ, డీవాటరింగ్, మట్టిని బయటకు పంపించే ప్రక్రియ సమాంతరంగా కొనసాగుతుంది. ఈ లోపు డేంజర్ జోన్ కంటే ముందు గల్లంతైన వారి ఆచూకీ లభిస్తే మంచిది. ఆ తర్వాత పరిస్థితి ఏమిటనే అంశంపై కూడా అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. డేంజర్ జోన్ వరకు మట్టిని తోడివేసే ప్రక్రియను యుద్ధప్రాతిపదికన ముగించాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం డేంజర్ జోన్ తర్వాత అనుసరించాల్సిన రెస్క్యూ ఆపరేషన్‌ను జువాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, టన్నెల్ తవ్వకంలో నిష్ణాతులైన ప్రపంచ నిపుణుల సలహా మేరకే ముందుకెళ్లాలని భావిస్తోంది. అవసరమైతే ఈ అంశంపై అఖిలపక్ష సమావేశాన్ని కూడా పిలవాలని యోచిస్తున్నట్లు సమాచారం.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గద్వాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని 99వ ప్యాకేజీ కాలువ పనుల వద్ద శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొండపల్లి గ్రామానికి చెందిన వెంకటన్న (53) అనే రైతు లక్ష్మి అనే మహిళతో కలిసి బ్యాంకు పని నిమిత్తం టీవీఎస్ వాహనంపై పూడూరుకు వెళ్తున్నారు. 99వ ప్యాకేజీ కాలువ వద్ద సిమెంటు పని జరుగుతుండగా, కాంక్రీట్ వాహనం రివర్స్ తీసుకుంటూ, వెనుకనే ఉన్న టీవీఎస్‌ను ఢీకొన్నది. ఆ సమయంలో వెనుక కూర్చున్న మహిళ తప్పించుకోగా, వాహనం నడుపుతున్న వెంకటన్న తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టుపక్కల వారు ఆయనను గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూల్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. అతడికి భార్య దేవమ్మ, పిల్లలు ఉన్నారు. సంఘటనపై విచారణ నిర్వహిస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

ఉపాధి కూలీ మృతి


జయమ్మ (ఫైల్)

మహమ్మదాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : పనికి వెళ్తూ ఉపాధి కూలీ మృతి చెందింది. మహబూబ్‌నగర్ జిల్లా, మహమ్మదాబాద్ గ్రామంలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. తోటి కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జయమ్మ(55) మూడు వారాలుగా ఉపాధి హామీ పనులకు వెళ్తోంది. శుక్రవారం కూడా పనికి వెళ్లేందుకు కొత్త పెట్రోల్ పంపు వద్దకు వచ్చింది. అక్కడ ప్రతీ రోజూ కూలీలను ఎక్కించుకు పోయే ట్రాక్టర్ల వద్ద కూర్చున్న ఆమె సొమ్మసిల్లి పడిపోయింది. తోటి కూలీలు ఆమెను సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందింది. అయితే ప్రతీ రోజూ ఎండలో పని చేయడం వల్లే జయమ్మ అస్వస్థతకు గురై చనిపోయిందని కూలీలు చెప్తున్నారు. ఆమెకు భర్త జయకుమార్, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

నవాబ్‌పేట, ఏప్రిల్ 11 : కాంట్రాక్ట్ ఉద్యోగి ఒకరు ప్రభుత్వ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని ఓ నిరుద్యోగి నుంచి రూ. 3.50 లక్షలు తీసుకున్నాడు. కానీ పదేళ్లయినా ఉద్యోగం ఇప్పించకపోవడంతో శుక్రవారం అతడు పోలీసులను ఆశ్రయించాడు. ఎస్ఐ విక్రం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలోని దాయపంతుల పల్లి గ్రామానికి చెందిన వడ్ల రాఘవేందర్‌కు పదేళ్ల క్రితం వికారాబాద్ జిల్లా, చౌడాపూర్ మండలం మరికల్ గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తితో పరిచయం అయ్యింది. అతడు కొత్తపల్లి ఆశ్రమ పాఠశాల (ఐటీడీఏ)లో కాంట్రాక్టు ఉపాధ్యాయుడు పని చేస్తున్నాడు. ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రాఘవేందర్ నుంచి రూ. 3.50 లక్షలు తీసుకున్నాడు. కానీ ఇప్పటివరకు ఉద్యోగం ఇప్పించకపోవడంతో పాటు, బెదిరింపులకు దిగాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'ఉదండాపూర్' నిర్వాసితుల అరెస్టు

జడ్చర్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ రిజర్వాయర్ వద్ద పనులను శుక్రవారం అడ్డుకునేందుకు యత్నించిన నిర్వాసితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో శేఖర్, కొప్పగిరి ఆంజనేయులు, యాట రామకృష్ణ, సిద్ధాపురం ఐలయ్య, జడల శ్రీనులను అరెస్టు చేసి, పోలీస్ శిక్షణ కేంద్రానికి తరలించారు. సాయంత్రం స్వంత పూచికత్తుపై వదిలేశారు.

చెరువులోకి దూసుకెళ్లిన ఆటో

▸▸ మేకలను తప్పించే యత్నంలో ఘటన


చెరువు నీటిలో పడి మునిగి పోయిన ఆటో

మూసాపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : చెరువు కట్ట మీదుగా ప్రయాణికులతో వస్తున్న ఆటోకు మేకలు అడ్డురావడంతో అదుపుతప్పి నీటిలోకి దూసుకెళ్లింది. మహబూబ్‌నగర్ జిల్లా, మూసాపేట మండలం, పొన్నకల్ గ్రామ సమీపంలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అడ్డాకుల మండలం, రాచాల గ్రామానికి చెందిన దాసరి ఆంజనేయులు తన ఆటోలో ప్రయాణికులు దాసరి కురుమూర్తి, డి.వెంకటేశ్వరమ్మ, డి.నర్సింహులు, ఎం.రవిశంకర్‌లతో పాటు మరొకరితో కలిసి రాచాల నుంచి పొన్నకల్‌కు బయలుదేరాడు. పొన్నకల్ శివారులోని చెరువుకట్ట మీదుగా వస్తుండగా మేకలు అడ్డురావడంతో తప్పించే యత్నంలో ఆటో అదుపు తప్పి చెరువు నీటిలోకి దూసుకెళ్లింది. ముగ్గురు ప్రయాణికులు అప్రమత్తమై కిందకు దూకేశారు. డ్రైవర్‌తో పాటు, కురుమూర్తి ఆటోలోనే ఉండిపోయారు. ఆటో నీటిలో పడిపోయిన తర్వాత వారిద్దరూ ఈదుకుంటూ బయటకు వచ్చారు. స్వల్ప గాయాలైన వారిద్దరినీ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కలెక్టర్ విజయేందిర బోయి పొన్నకల్‌కు వచ్చిన సందర్భంగా విషయం తెలిసి, ఆరా తీసినట్లు స్థానికులు తెలిపారు.

మన చదువులు జ్యోతిరావు పూలే పెట్టిన బిక్ష


మాట్లాడుతున్న గుమ్మడి వెన్నెల

గోపాల్‌పేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మన చదువులు, ఉద్యోగాలు జ్యోతిరావు పూలే పెట్టిన బిక్ష అని రాష్ట్ర సంస్కృతిక శాఖ చైర్మన్ డాక్టర్ గుమ్మడి వెన్నెల అన్నారు. వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండలంలోని తాడిపర్తి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ సన్నాహక సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అక్కడి నుంచి ఎస్సీ కాలనీ మీదుగా ప్రజలను పలుకురించకుంటూ కొత్త గ్రామ పంచాయతీ వద్ద, లక్ష్మీసముద్రం కట్ట మీదున్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించారు. పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో కుల వివక్ష నిర్మూలన, మహిళా విద్యాభివృద్ధిలో జ్యోతిరావు పూలే కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవి, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరి రాములు, సేవాదళ్ అధ్యక్షుడు జానకి రాములు, సోషల్ మీడియా వనపర్తి జిల్లా అధ్యక్షుడు దేవన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

- పీయూ కాంట్రాక్టు అధ్యాపకుల డిమాండ్


ర్యాలీ నిర్వహిస్తున్న పాలమూరు యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు

పాలమూరు యూనివర్సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలో పని చేస్తున్న తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని పీయూ కాంట్రాక్ట్ అధ్యాపకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు పాల మూరు యూనివర్సిటీలో పరిపాలనా భవనం నుంచి ఫార్మసీ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని, అ తర్వాత మిగిలిన ఖాళీలను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వారి ఆందోళనకు విద్యార్థులు సంఘీభావం తెలిపారు.

దాహం తీర్చే నీటి తొట్లు

▸▸ వేసవిలో పశువులకు అత్యంత ఉపయోగం

▸▸ మరమ్మతు చేయాలని కలెక్టర్ ఆదేశం

▸▸ ట్యాంకర్లతో నీరు నింపుతున్న కార్యదర్శులు

▸▸ అవసరమైన చోట కొత్తవి నిర్మించాలి

▸▸ రైతులు, పశువుల కాపరుల విజ్ఞప్తి


అయిజ మండలం, మేడికొండ గ్రామంలో తొట్టిలోని నీరు త్రాగుతున్న గేదెలు.

అయిజ టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : భానుడు మండిపడుతున్నాడు.. ఎండలు రోజురోజుకూ అధికం అవుతున్నాయి. గ్రామాల్లోని బావులు, చెరువుల్లో నీరు అడుగంటుతోంది. ప్రజలు తమకు కావలసిన నీటి అవసరాలను తీర్చుకునేందుకు ఎన్నో మార్గాలున్నాయి. కానీ పశువుల దాహం తీర్చేందుకు గతంలో ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన నీటి తొట్లే ఆధారంగా ఉన్నాయి. దాదాపు 15 సంవత్సరాల క్రితం, అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీలో పశువుల కోసం నీటి తొట్లు నిర్మించింది. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కో నీటి తొట్టి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 20 వేలు ఖర్చు చేసింది. ప్రస్తుతం ఉన్న జోగుళాంబ గద్వాల జిల్లాలో అప్పట్లో 195 గ్రామ పంచాయతీలుండేవి. చిన్న గ్రామాల్లో ఒకటి లేదా రెండు తొట్లు, పెద్ద గ్రామాల్లో మూడు నుంచి నాలుగు వరకు నీటి తొట్లను నిర్మించారు. ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావం, కొత్త జిల్లాల ఏర్పాటు తరువాత జిల్లాలో అదనంగా మరో 60 కొత్త గ్రామ పంచాయితీలు ఏర్పాటయ్యాయి. ఆయా గ్రామాల్లో కొత్తగా నీటి తొట్లు నిర్మించలేదు. అప్పట్లో నిర్మించిన నీటి తొట్లు ప్రస్తుతం చాలా వరకు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం ఎండ తీవ్రత పెరగడంతో పశువుల దాహం తీర్చేందుకు అన్ని గ్రామాల్లో నీటి తొట్లను మరమ్మతు చేసి వినియోగంలోకి తేవాలని కలెక్టర్ ఆదేశించారు.

దీంతో ఆయా గ్రామాల్లో కార్యదర్శులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. పూర్తిగా శిథిలమైనవి కాకుండా 70 నుంచి 80 శాతం వరకు నీటి తొట్లను గ్రామ పంచాయతీ నిధులతో మరమ్మతు చేయించి, ట్యాంకర్లతో నీరు నింపుతున్నారు. పశువులు, గొర్రెలు, మేకలు ఉదయం మేతకు వెళ్లే సమయంలో, సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సమయంలో వాటికి అందుబాటులో ఉండేలా తొట్లలో నీరు నింపి ఉంచుతున్నారు. ఇతర సమయాల్లో ప్రజలు అవసరాలకు కూడా ఈ నీటిని ఉపయోగించుకునే వెసలుబాటు ఉంటుంది.

మండల పరిషత్ ఆదేశాలతో..



మండల పరిషత్ అధికారుల ఆదేశాలతో గ్రామంలో ఉండే నీటితొట్లకు మరమ్మతులు చేయించాం. గ్రామ పంచాయితీ ట్యాంకర్‌తో ప్రతీ రోజు వాటిలో నీరు నింపుతున్నాం. దీంతో పశువుల దాహార్తి తీరడంతో పాటు, ప్రజల ఇతర అవసరాలకు కూడా ఈ నీరు ఉపయోగపడుతోంది. తొట్లలో ప్రతీ రోజు నీరు ఉండేలా వాటర్‌మన్ చర్యలు తీసుకుంటున్నారు.

- రామాంజనేయులు, పంచాయితీ కార్యదర్శి, పాతపాలెం

చాలా మంచి నిర్ణయం



ఎండాకాలం గ్రామాల్లో పశువులు నీరు తాగేందుకు నీటి తొట్లను నీటితో నింపడం చాలా మంచి నిర్ణయం. ఇప్పుడున్న పరిస్థితుల్లో అడవుల్లో కూడా నీరు అందుబాటులో లేదు. పశువుల యజమానుల ఇళ్ల వద్ద అవసరమైనంత నీరు అందుబాటులో ఉండదు. ఈ పరిస్థితుల్లో నీటి తొట్లు చాలా అవసరం. మాది కొత్త గ్రామ పంచాయతీ. గ్రామంలో వెంటనే నీటి తొట్లు నిర్మించాలి.

- రమేశ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, రాజాపురం

10 రోజుల క్రితం ఆదేశాలు



అన్ని గ్రామపంచాయితీల్లో నీటితొట్లను అందుబాటులోకి తేవాలని కలెక్టర్ పది రోజుల క్రితం ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు గ్రామ పంచాయితీ కార్యదర్శులతో మాట్లాడి నీటి తొట్లను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే చాలా గ్రామాల్లో తొట్లు ఉపయోగంలోకి వచ్చాయి. కొత్త గ్రామ పంచాయితీల్లో నీటితొట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపిస్తాం.

- వెంకటయ్య, ఎంపీడీవో, అయిజ మండలం

పేద విద్యార్థులకు రవాణా భత్యం

▸▸ వనపర్తి జిల్లాలో 338 మందికి లబ్ధి

▸▸ మంజూరైన రూ. 20.28 లక్షలు

వనపర్తి విద్యా విభాగం, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. అందుబాటులో పాఠశాలలు, వసతిగృహాలు, బస్సు సౌకర్యం లేకపోవడం, ప్రైవేటు వాహ నాల్లో చార్జీలు పెట్టుకొని వెళ్లి చదువుకునేంత స్తోమత లేకపోవడం అందుకు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో వారికి అండగా నిలిచి, చదువు కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

నాలుగు సంవత్సరాల తర్వాత..

గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు చుట్టూ మూడు కిలో మీటర్ల వరకు పాఠశాల, వసతి గృహం, బస్సు సౌకర్యం లేక చదువుకునేందుకు ఇబ్బంది పడుతుంటారు. మూడు కిలోమీటర్ల కన్నా ఎక్కువ దూరం ప్రయాణించి చదువుకుంటూ, 75 శాతానికి పైగా హాజరు నమోదైతే కేంద్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష అభియాన్ కింద రవాణా సౌకర్యం కోసం నెలకు రూ.600 చొప్పున 10 నెలలకు రూ. 6 వేలు అందిస్తోంది. ఈ నిధులను ప్రభుత్వం చివరిసారిగా 2018-19 విద్యా సంవత్సరంలో మంజూరు చేసింది. అప్పుడు వనపర్తి జిల్లాలో 320 మంది పేద విద్యార్థులకు రవాణా ఖర్చులను అందించారు. దాదాపు 4 సంవత్సరాల తరువాత 2024-25 సంవత్సరానికి గాను వనపర్తి జిల్లాలో 338 మంది విద్యార్థులకు రూ. 20.28 లక్షలు అందనున్నాయి.

బ్యాంకు ఖాతా లేక చేకూరని లబ్ధి

కేంద్ర ప్రభుత్వం ద్వారా రవాణా ఖర్చులు పొందాలంటే విద్యార్థులు తమ పేరు మీద బ్యాంకు ఖాతా కలిగి ఉండాలి. వనపర్తి జిల్లాలో 2024-25 సంవత్సరానికి సమగ్ర శిక్ష అభియాన్ కింద రవాణా ఖర్చులు పొందాల్సిన విద్యార్థులు 1,046 మంది ఉన్నారు. వారిలో ముప్పావు వంతు విద్యార్థులకు బ్యాంకు ఖాతా లేక పోవడంతో రవాణా ఖర్చులను పొందలేకపోతున్నారు. కేవలం 338 మంది విద్యార్థులకు మాత్రమే తమ పేరు మీద బ్యాంకు ఖాతాలున్నాయి. వారికి మాత్రమే లబ్ధి చేకూరనున్నది. ఉన్నతాధికారులు స్పందించి రానున్న విద్యా సంవత్సరంలోనైనా అర్హులైన విద్యార్థులందరూ బ్యాంకు ఖాతాలు తెరిచేలా అవగాహన కల్పించాల్సి ఉంది.

తడిసిన మిర్చి, పొగాకు

▸▸ అకాల వర్షంతో నష్టపోయిన రైతులు


మానవపాడులో తడిసిన మిర్చిని చూపుతున్న రైతులు

మానవపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు కురిసిన అకాల వర్షానికి కల్లాల్లో ఉన్న మిర్చి, పొగాకు తడిసిపోయాయి. వర్షాకాలం మొదలుకొని నేటి వరకు పంట పొలాల్లో రేయింబవళ్లు కష్టపడి సాగు చేసిన పంటలు చేతికి వచ్చేసరికి అకాలవర్షం దెబ్బ తీసింది. కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి, కుప్పలుగా వేసిన పొగాకు తడిసిపోవడంతో వాటిని కొనేవారు కరువయ్యారని రైతులు వాపోతున్నారు. నాటుకు ముందు పొగాకు కొనుగోలు చేస్తామని చెప్పిన వివిధ కంపెనీలు ఆ తర్వాత పట్టించుకోలేదని చెప్తున్నారు. దీంతో రెండు నెలలుగా పంటను పొలాల వద్దే కుప్పలు పెట్టామని చెప్తున్నారు. అకాల వర్షంతో మానవపాడు మండలంలోని అమరవాయి, మానవపాడు, చెన్నిపాడు, కలుకుంట్ల, పెద్ద ఆముదలపాడు, నారాయణపురం, బోరవెల్లి, పల్లెపాడు, జల్లాపురం గ్రామాల్లోని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఉన్నతాధికారులు స్పందించి మిర్చికి మద్దతు ధర, పొగాకును కంపెనీల ద్వారా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

▸▸ గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి ముందు కుటుంబ సభ్యుల ఆందోళన

▸▸ నా భర్తను ట్రాన్స్‌జెండర్లే చంపేశారు : భార్య కృష్ణవేణి ఆరోపణ

▸▸ విచారించి చర్యలు తీసుకుంటాం : సీఐ టంగుటూరి శ్రీను

▸▸ బాధితులను పరామర్శించిన గొంగళ్ల రంజిత్‌కుమార్


మృతికి కారణమైన వారిని శిక్షించాలని ఆందోళన చేస్తున్న మృతుని భార్య, బంధువులు


రామకృష్ణ (ఫైల్)

మల్దకల్/ గద్వాల క్రైం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండల కేంద్రానికి చెందిన రామకృష్ణ (24) అనే యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన కొత్త కురువ రామకృష్ణ, కృష్ణవేణి దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. కృష్ణవేణి ఈనెల 10న రాజోలిలో సమీప బంధువుల వివాహానికి వెళ్లింది. మరుసటి రోజు, 11వ తేదీన ఉదయం రామకృష్ణ కూడా పెళ్లికి వెళ్లేందుకు సిద్ధం అవుతున్నాడు. అదే సమయంలో గద్వాల పట్టణానికి చెందిన ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు ఇంటికి వచ్చి అతడిని ఆటోలో గద్వాలకు తీసుకువెళ్లారు. ఇంటి పక్కనున్న వారు గమనించి ఎక్కడికి తీసుకెళ్తున్నారని అడుగగా, ఆసుపత్రికని చెప్పారు. దీంతో వారు భార్య కృష్ణవేణికి ఫోన్ చేసి చెప్పారు. ఆమె తన చిన్నాయన రామాంజనేయులుకు విషయం చెప్పడంతో ఆయన ఆస్పత్రికి వెళ్లాడు. అప్పటికే రామకృష్ణ మృతి చెంది ఉన్నాడు. వైద్యులు కూడా పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం భార్య కృష్ణ వేణి, బంధువులు కూడా ఆసుపత్రికి చేరుకున్నారు. రామకృష్ణ గొంతుపై నల్లని కాటు ఉందని, ట్రాన్స్ జెండర్లు తన భర్తను ఇంట్లోనే గొంతు నులిమి చంపి, ఆటోలో ఆసుపత్రికి తీసుకొచ్చారని వారు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు భార్య కృష్ణవేణి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ పూజయ్య తెలిపారు.

మీరు వెళ్లండి.. నేను వస్తాను

'మీరు పెళ్లికి వెళ్లండి.. నేను తర్వాత వస్తాను.. అని చెప్పిన నా భర్త ఇలా శవం అవుతాడని అనుకోలేదు' అని మృతుడు రామకృష్ణ భార్య కృష్ణవేణి ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్తను చంపిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో బాధిత కుటుంబ సభ్యులు, బంధు వులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్తను కొంత కాలంగా ట్రాన్స్‌జెండర్ శివాని ఇబ్బంది పెడుతోందని చెప్పారు. తన భర్త గతంలో ఆమెతో సన్నిహితంగా ఉండేవారని, ఇటీవల కొంత కాలం నుంచి మాట్లాడకపోవడంతో ఇంటి మీదకు వచ్చి చంపిందని ఆరోపించారు. ట్రాన్స్‌జెండర్ శివానితో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేసే వరకు పోస్టుమార్టం చే యనివ్వబోమని బంధువులు కర్నాకర్, రామాంజనేయలు పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న గద్వాల సీఐ టంగుటూరి శ్రీను ఆసుపత్రికి చేరుకొని వారితో మాట్లాడారు. సంఘటనపై విచారణ చేపట్టి దోషులను పట్టుకుంటామని, పోలీసులకు సహకరించాలని కోరారు. దీంతో వారు పోస్టమార్టానికి అంగీకరించారు. విషయాన్ని తెలుసుకున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. దోషులను కఠినంగా శిక్షించాలని సీఐని కోరారు.

రామకృష్ణ మృతిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని బీఆర్ఎస్ నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు డిమాండ్ చేశారు. సీఐ వెంట గట్టు ఎస్ఐ మల్లేశ్, ట్రైనీ ఎస్ఐ స్వాతి ఉన్నారు.

నిరీక్షణకు తెర

▸▸ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ సేవలు

▸▸ రెండో రోజు 65 దస్తావేజుల రిజిస్ట్రేషన్


రిజిస్ట్రేషన్ చేస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో రిజిస్ట్రేషన్‌ల కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సిన పనిలేకుండా స్లాట్ బుకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వం రాష్ట్రంలో ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగే పలు రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా స్లాట్ బుకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురాగా, అందులో మహబూబ్‌నగర్ రిజిస్ట్రార్ కార్యాలయం కూడా ఉంది. తొలిరోజు, గురువారం 79 దస్తావేజులు స్లాట్ బుకింగ్ విధానం ద్వారా చేపట్టారు. శుక్రవారం 64 స్లాట్ బుకింగ్‌లు చేసుకోగా, అందులో 61 దస్తావేజుల రిజిస్ట్రేషన్‌లు చేయగా మూడు పెండింగ్‌లో ఉన్నాయి. అదే విధంగా వాక్ ఇన్ ద్వారా మరో 4 దస్తావేజులు రిజిస్ట్రేషన్ చేశారు. స్లాట్ బుకింగ్ సేవల ద్వారా రిజిస్ట్రేషన్‌ల కోసం ఎక్కువ సమయం నిరీక్షించాల్సిన పనిలేకుండా పోవడంతో ప్రజల్లో ఆనందం వ్యక్తం అవు తుంది. ఇది వరకు నేరుగా కార్యాలయాలకు వస్తే తమది ఎప్పుడు వస్తుందో తెలియక రోజంతా కార్యాలయం వద్దే పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఇప్పుడు స్లాట్ బుకింగ్ విధానం ద్వారా ముందే ఫలానా సమయం అని తెలుస్తుంది. ఆ సమయంలో వస్తే గంటలోపే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది.

చిన్నంబావిలో 39.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

వనపర్తి అర్బన్/నారాయణపేట, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శుక్రవారం వాతావరణం కాస్త చల్లబడింది. గురువారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షంతో ఈ మార్పు కనిపించింది.

వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలో 39.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అత్యల్పంగా రేవల్లి మండలంలో 21.2 డిగ్రీలు నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠంగా 38.4,డిగ్రీలు కనిష్ఠంగా 23.2 డిగ్రీలు నమోదైంది. నారాయ ణపేట జిల్లాలో గరిష్ఠంగా 37 డిగ్రీలు, కనిష్ఠంగా 25 డిగ్రీలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యధికంగా 35 డిగ్రీలు, కనిష్ఠంగా 25 డిగ్రీలు నమోదైంది.

జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. గద్వాల, గట్టులో 40.7 డిగ్రీలు, అయిజ, అలంపూర్‌లో 40.6, ఇటిక్యా ల, మల్దకల్‌లో 40.5 డిగ్రీలుగా నమోదు అవుతుంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 21.7నుండి 23 డిగ్రీలుగా నమోదు అవుతున్నది.

ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంగా భవానీప్రసాద్


భవానీప్రసాద్

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డిప్యూటీ ఆర్ఎం(ఎం)గా ఎస్.భవానీ ప్రసాద్ నియమితులయ్యారు. ఖమ్మం రీజీయన్‌లో డిప్యూటీ ఆర్ఎంగా పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చి, శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గత రెండు సంవత్సరాల నుంచి ఇక్కడ డిప్యూటీ ఆర్ఎం(ఎం)గా పని చేసిన శ్యామల హైదరాబాద్, మియాపూర్‌లోని బస్ బాడీ వర్క్‌షాప్‌నకు బదిలీ అయ్యారు.

ఇంటర్వ్యూ..

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

- జి కొండల్, విద్యుత్ ఏఈ



ఉప్పునుంతల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కనెక్షన్లతో పాటు టూ కేటగిరి గృహజ్యోతి పథకం అమలు కాని విద్యుత్ వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి విద్యుత్ అధికారులకు తోడ్పాటు అందించాలని ఉప్పునుంతల విద్యుత్ ఏఈ జి కొండల్ శుక్రవారం ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తెలిపారు.

మండలంలో ఎన్ని సబ్‌స్టేషన్లు ఉన్నాయి?

మండలంలో పెనిమిళ్ల, పెద్దాపూర్, వెల్టూరు, ఉప్పునుంతల, తాడురు గ్రామాల్లో సబ్ స్టేషన్లు ఉన్నాయి

మండలంలో ఎన్ని వ్యవసాయ కనెక్షన్లు, ఎన్ని గృహ కనెక్షన్లు ఉన్నాయి?

వ్యవసాయ కనెక్షన్లు 6967, గృహ కనెక్షన్లు 5822 ఉన్నాయి.

గృహజ్యోతి పథకానికి ఎంత మంది అర్హులు అవుతున్నారు.

4865 మంది గృహ జ్యోతి పథకంలో లబ్ధిపొందుతున్నారు.

మండలంలో ఎక్కడైనా లోవోల్టేజీ సమస్య ఉందా?

మండలంలో ఇప్పటి వరకు ఎక్కడా లోవోల్టేజీ సమస్య లేదు. ఇప్పటి వరకు నా దృష్టికి రాలేదు. వేసవిలో కూడా 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

న్యూస్ బాక్స్

వాలీబాల్ పోటీలు ప్రారంభం

వంగూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో అంబేడ్కర్ కమిటీ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను శుక్రవారం మాజీ సర్పంచ్ గణేష్‌రావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమేష్‌గౌడ్‌లు ప్రారంభించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా వాలీబాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గణేష్, యాదగిరిరావు, ఎల్లాగౌడ్, మల్లేష్, యాదయ్య బాలస్వామిగౌడ్, శ్రీశైలం పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కొల్లాపూర్, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ డిపో పరిధిలోని ప్రజా రవాణా సమస్యలపై ప్రజలతో తగు సూచనలు, సలహాలు తీసుకొనేందుకు నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఉమా శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు 9493733602 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

నేడు కల్వకుర్తి ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

- ఏఈ శ్రీనివాస్ నాయక్

కల్వకుర్తి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పరిధిలోని తర్నికల్, పోల్కంపల్లి 33/11 కేవీ విద్యుత్ లైన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ విద్యుత్ లైన్ల వెంట చెట్లు విపరీతంగా పెరగడం వల్ల తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. కల్వకుర్తి మండలంలోని ఎల్లికల్, గుండూరు, తర్నికల్, వెంకటాపూర్,తోటపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో రేపు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అమ్రాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట 33/11 కేవీ విద్యుత్ లైన్‌లో పెరిగిన చెట్లను కటింగ్ చేయడానికి శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అమ్రాబాద్ ట్రాన్స్‌కో ఏఈ రమేష్, స్థానిక లైన్‌మన్ ఆంజనేయులు శుక్రవారంతెలిపారు. ఉమ్మడి మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవం

కొల్లాపూర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రైతు సంఘం జెండాను మండల కార్యదర్శి బాలపీరు ఆవిష్కరించారు. అఖిల భారత కిసాన్ సభ 1936 ఏప్రిల్ 11న ఏర్పడిందని ఆయన అన్నారు. నాటి నుంచి నేటి వరకు అఖిల భారత కిసాన్ సభ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు నడిపిన చరిత్ర ఏఐకెఎస్‌కు ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శివ శంకర్, నాగేషయ్య, బాలయ్య, సత్యనారాయణ, రాజు, భాను, రామకృష్ణ, రవీందర్, పురేందర్, ఆవాజ్, జిల్లా కన్వీనర్ సలీం, కేవీపీఎస్ మండల కార్యదర్శి బత్తిని రాజు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వంగూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాజాల గ్రామ సమీపంలో ఈ నెల 7న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జాజాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బాలస్వామిగౌడ్ హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అతని మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. రోడ్డు ప్రమాదంలో బాలస్వామి గౌడ్ మృతి చెందడం దురదృష్టకరమని గ్రామ, మండల పార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

వీధి కుక్కల భయం.. ఇళ్ల ముందూ తిరగని జనం

- వీధికుక్కల బెడద తీరేది ఎప్పుడు?
- మనుషులతోపాటు మేకలను, గొర్రెలకు తప్పని కుక్కల బెడద
- జంగమోనిపల్లిలో 23 మేక పిల్లలను చంపిన కుక్కలు



వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు



జంగమోనిపల్లిలో కుక్కల దాడిలో చనిపోయిన 23 మేక పిల్లలు (ఫైల్)

తెలకపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వీధి కుక్కలు అటవీ జంతువుల్లా గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగుతూ మనుషులతో పాటు జంతువులను కూడా చంపుకుని తింటున్నాయి. కుక్కల భయానికి ప్రజలు వీధుల్లో తిరగాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. గతంలో మహిళలు ఇంటిబయట కూర్చొనేవారు, ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. పిల్లలు వీధుల్లో ఆడుకునేవారు. కుక్కల భయానికి పిల్లలను వారి తల్లిదండ్రులు ఇంటి ముందు కూర్చోనివ్వడం లేదు. పిల్లలు వీధల్లో తిరుగుతూ ఆడుకొనే పరిస్థితి కనిపించడం లేదు. దీనికి మొత్తం కారణం వీధి కుక్కలే. వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ పిల్లలను ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. కొన్ని నెలల క్రితం పిచ్చి కుక్క దాదాపు ఐదారుగురిని కరవడంతో వారంతా ఆస్పత్రి పాలయ్యారు. ఆదివారం, పండుగల సందర్భాల్లో ప్రజలు మార్కెట్‌కు వెళ్లి చికెన్, మటన్ తెచ్చుకోవాలన్న భయాందోళనకు గురవుతున్నారు. అలా తెస్తున్నప్పుడు మనుషులపైకి ఎగబడి చికెన్, మటన్ కవర్లను నోటితో కరచుకొని పోవడంతో పాటు వారిపై దాడి చేసి గాయాల పాల చేస్తున్నాయి. మండల పరిధిలోని జంగమోనిపల్లిలో ఈ మధ్యకాలంలోనే పొలంలో మేక పిల్లలను దొడ్డిలో ఉంచగా వీధి కుక్కలు వాటిపై దాడి చేసి 23 మేక పిల్లలను చంపితిన్నాయి. మండల కేంద్రంలో బస్టాండ్ ఎదురుగా ఉన్న కాలనీలో కోళ్లను ఎత్తుకుని పోయితిన్నాయి. గతంలో కుక్కల బెడదపై ప్రజలు అధికారులకు అనేక సార్లు అధికారులకు విన్నవించినా కనీసం పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కుక్కల బెడద నుంచి ప్రజలను, జంతువులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసు కుని కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కుక్కల బెడద నుంచి కాపాడాలి



మండలంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. గతంలో అధికారులకు ఫిర్యాదు చేశాము. కొంత వరకు స్పందించినా తర్వాతి కాలంలో వీధి కుక్కలను పట్టించుకోకపోవడంతో అవి రెచ్చిపోయి ప్రజలమీద పడడంతో గాయాలపాలవుతున్నారు. జంగ మోనిపల్లిలో 23 మేకలను చంపితినడం దారుణం. ఆయా గ్రామాల అధికారులు స్పందించి వెంటనే కుక్కల బెడదను నివారించాలి. - శివ, తెలకపల్లి

ఆశయాలు కొనసాగిస్తాం

- జైభీమ్ దీక్షా సమితి వ్యవస్థాపకుడు వంకేశ్వరం నిరంజన్
- జిల్లా కేంద్రంలో ఘనంగా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు



పూలే జయంతిలో పాల్గొన్న జైభీమ్ సమితి సభ్యులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : అణగారిన వర్గాల కోసం పాఠశాలలు స్థాపించి ఉచిత విద్యను అందించిన సంఘ సంస్కర్త మహాత్మజ్యోతిబాపూలే ఆశయా లను కొనసాగిస్తామని జైభీమ్ దీక్షా సమితి వ్యవస్థాపకుడు, రాష్ట్ర దళిత నాయకుడు వంకేశ్వ రం నిరంజన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పలు పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బాబు జగ్జీవన్‌రాం భవన్‌లో జైభీమ్ దీక్షా సమితి ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన పూలే చిత్ర పటానికి ఆ సంఘం అధ్యక్షుడు వంకేశ్వరం నిరంజన్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పూలే జయంతి రోజు దేశ వ్యాప్తంగా సెలువు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జైభీమ్ దీక్షా సమితి జిల్లా అధ్యక్షుడు దేవర పాగ బంగారయ్య, ప్రధాన కార్యదర్శి కొత్త పరశురాములు పాల్గొ న్నారు. ● విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పిడి కిళ్ల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, వర్కింగ్ ప్రెసి డెంట్ కుంభం మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆ సంఘం కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

●అచ్చంపేటటౌన్ : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో, అంబేడ్కర్ ప్రజాభవన్‌లో జ్యోతిబాపూలే చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రాజేందర్, కాంగ్రెస్ నాయకులు, డిపో మేనేజర్ ప్రసాద్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో జ్యోతిరావు పూలే చిత్రపటానికి మార్కెట్ కమిటీ ఛైర్మన్ రజిత పూలమాల వేసి నివాళులు అర్పించారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి : మాజీ ఎమ్మెల్యే

కొల్లాపూర్ : కొల్లాపూర్‌లోని మహాత్మా జ్యోతి బాపూలే విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మహానాయకుడు మహాత్మా జ్యోతిబా పూలే అన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కొల్లాపూర్ పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు జూపల్లి అరుణ్, మాజీ ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పూలమా లలు వేసి ఘన నివాళి అర్పించారు.

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ ఐక్యవేదిక కన్వీనర్ చంద్రశేఖర్ చారి ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాస్ రెడ్డి, బీసీ ఐక్యవేదిక నాయకులు కట్ట రాజేందర్ గౌడ్, లక్ష్మయ్య పాల్గొని మహాత్మా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం

కల్వకుర్తి : మహాత్మాజ్యోతిరావు పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు బీసీ సబ్ ప్లాన్ సాధన కమిటీ కల్వకుర్తి అధ్యక్షుడు మేకల రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి వేడుకలను నిర్వహించారు.



అచ్చంపేటలో...



కొల్లాపూర్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి

ఉచిత పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్

- పరిశీలించిన డీఈవో రమేష్‌కుమార్



జిల్లా కేంద్రంలో పాఠ్యపుస్తకాల దిగుమతిని పర్యవేక్షిస్తున్న డీఈవో రమేష్‌కుమార్

నాగర్‌కర్నూల్‌టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యా సంవత్సరం 2025-26 కోసం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే ఉచిత పాఠ్యపుస్తకాలు జిల్లాకు వచ్చేశాయి. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గోదాంలో పాఠ్యపుస్తకాలను భద్రపరిచారు. గోదాంను జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్ పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఆదర్శ, కేజీబీవీలు కలుపుకొని మొత్తం 939 పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. వాటిల్లో మొత్తం 72,641 మంది విద్యార్థులు చదువుతు న్నారని, వారందరి కోసం సుమారు 6 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరం అవుతాయని తెలిపారు. అయితే ఇప్పటికి జిల్లాకు వివిధ తరగతులకు సంబంధించి ఆయాసబ్జెక్టు పాఠ్యపుస్తకాలు 35,710 వచ్చాయన్నారు. జిల్లా పాఠ్యపుస్తకాల మేనేజరు నరసింహులు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా బోధన

చారకొండ : ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా ప్రభుత్వం విద్యా ర్థులకు విద్యబోధన అందిస్తుందని డీఈవో రమేష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులు రాస్తున్న పరీక్షలను ఆయన పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి ఒత్తిడి లేని విద్యా బోధనతో విద్యార్థులకు సృజనాత్మకత పెంపొందించేందుకు డిజిటల్ క్లాసులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అనంతరం సిరసనగండ్ల సీతారామచంద్ర స్వామి దేవాలయంలో డీఈవో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. డీఈవో వెంట ఎంఈవో ఝాన్సీరాణి, జీహెచ్ఎం భగవాన్‌రెడ్డి, జిల్లా పాఠ్యపుస్తకాల మేనేజర్ ఎం. నరసింహ, ఉపాధ్యాయులు యాదగిరి, కమలాకర్‌రావు, బాలాజీ, రామకృష్ణ, వెంకటేశ్వ ర్లు, గీతా, ఫిజికల్ డైరక్టర్ డాక్యనాయక్, సీఆర్‌పీ యాదగిరిగౌడ్ ఉన్నారు.

ఈదురుగాలులకు నష్టపోయిన పంటల పరిశీలన



పాపగల్‌లో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో సందీప్‌రెడ్డి

తాడూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : గత రెండు మూడు రోజులుగా సాయంత్రం వేళ పెద్ద ఎత్తున ఈదురుగాలులు వీస్తూ వర్షం కురుస్తున్న నేపథ్యంలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట నేలకు వాలిపోతున్నది. రైతుల అభ్యర్థన మేరకు శుక్రవారం మండల వ్యవసాయ శాఖ అధికారి సందీప్‌రెడ్డి పాపగల్, సిర్సవాడ తదితర గ్రామాల్లో నష్టపోయిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంటలు కోతదశలో ఉన్నందున తీవ్ర గాలుల కారణంగా అడ్డం పడిపోతున్నాయని దీంతో రైతులకు హార్వెస్టింగ్ చేసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 26 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిందని, ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. ఇంకా ఎక్కడైనా పంటలు నష్టపోతే ఏఈవోల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

రేపు బీపీ మండల్ వర్ధంతి

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 13న మధ్యాహ్నం 2గంటలకు హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆశయ సాధన సమితి, బీసీ జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న బిందేశ్వరి ప్రసాద్ మండల్ (బీపీ మండల్) వర్ధంతి సభకు ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని బీసీ జన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ వర్ధంతి సభకు ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి కృష్ణా యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, అంజయ్యయాదవ్‌తోపాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు అజయ్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు.

వలస కుటుంబాల పిల్లలపై శ్రద్ధ తీసుకోవాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ కేవీ స్వరాజ్యలక్ష్మి

కందనూలు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వలస కుటుంబాల చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కేవీ.స్వరాజ్యలక్ష్మి అన్నారు. జాతీయ సురక్ష మాతృత్వ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆశా నోడల్ పర్సన్లు, ఆశా ఫెసిలిటేటర్లకు డీఎంహెచ్‌వో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మట్లాడుతూ ప్రతీగర్భవతి సురక్షిత మాతృత్వం పొందాలనే లక్ష్యంతో వైద్య సిబ్బంది పని చేయాలని సూచించారు. కన్‌స్ట్రక్షన్ సైట్స్, ఇటుక, బొగ్గు బట్టీల దగ్గర, వలస కుటుంబాల చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ నివారణ చర్యల గురించి ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఎలా తయారు చేసుకొని, వాడాలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ రవికుమార్, పర్యవేక్షణ సిబ్బంది కొ్ట నిరంజన్, రాజేష్, విజయ్ కుమార్, మంగమ్మ, ఆశా నోడల్ పర్సన్లు, ఆశా ఫెసిలిటేటర్స్ పాల్గొన్నారు.

మాతృ మరణాలను నివారించాలి

శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ స్వరాజ్యలక్ష్మి తన చాంబర్‌లో బల్మూరు, ఊర్కొండ మండలాల్లో ఇటీవల జరిగిన మాతృ మరణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గర్భవతుల నమోదును, చేసిన రక్త, మూత్ర పరీక్షల వివరాలను, ప్రసవ చరిత్రను, ప్రత్యక్ష, పరోక్ష కారణాలను, మాతృ మరణాలను నివారించగల పరిస్థితులను జిల్లా మాతృ మరణాల సమీక్ష కమిటీ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో సమీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటదాసు, డాక్టర్ భీమానాయక్, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ లక్ష్మణ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నాగర్ కర్నూల్ గైనకాలజిస్టు నీలిమ, డాక్టర్ విజయ్ కుమార్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతగా ప్రజల్లో చెరగని ముద్ర

- జిల్లా ప్రధాన న్యాయాధికారి డి.రాజేష్‌బాబు
- ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజేష్‌బాబు

కందనూలు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహనీయుడు డాక్టర్ భీమ్‌రావు అంబేడ్కర్ అని జిల్లా ప్రధాన న్యాయాధికారి డి.రాజేష్‌బాబు అన్నారు. ఈనెల 14 అంబేడ్కర్ జయంతి ఉండగా, వరుసగా మూడు రోజులు సెలవులు ఉన్నందున హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి డి.రాజేష్‌బాబు హాజరై మాట్లాడారు. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన మహాయోధుడన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి జూనియర్ సివిల్ జడ్జి, నాగర్‌కర్నూల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికాంత్, చీఫ్ ఎల్ఏడీసీ మధుసూదన్, బార్ అసోసియేషన్ మెంబర్లు, జ్యుడీషియల్ ఎంప్లాయిస్, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఆంజనేయస్వాముల ఇరుముడి



ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయం ఆవరణలో ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న స్వాములు

ఊర్కొండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి వారి ఆలయ ప్రాంగణంలో గురుస్వాముల ఆధ్వర్యంలో శుక్రవారం ఇరుముడి కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వాములు మాట్లాడుతూ హనుమాన్ మాలధారణ స్వాములు 40 రోజులుగా కఠోర దీక్షలో ఉండి భగవంతుని ప్రార్థిస్తారని తెలిపారు. వారికి సుఖసంతోషాలతో పాటు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని అన్నారు. కార్యక్రమంలో రామాంజనేయులుగౌడ్, హనుమంతు, శ్రీనుసాగర్, ఆంజనేయులు, మల్లయ్య ఉన్నారు.

చౌడేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

మండలంలోని ముచ్చర్లపల్లి గ్రామంలో శుక్రవారం చౌడేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, గ్రామస్థులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, కృష్ణ గౌడ్, దివాకర్‌గౌడ్, తాడెం చిన్న, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని నాయకత్వంలో ఎన్నో చరిత్రాత్మక నిర్ణయాలు

- బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బాలాజీ



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మండికారి బాలాజీ

అచ్చంపేటటౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశంలో ఎన్నో చరిత్రాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నారని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మండికారి బాలాజీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మాజీ ఎంపీ రాములు నివాసంలో బీజేపీ మండల అధ్యక్షుడు వరికుప్పల ఆంజనేయులు అధ్యక్షతన క్రియాశీల సభ్యుల సమావేశం నిర్వహించారు. బాలాజీ మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అచ్చంపేట నియోజకవర్గంలో మెజారిటీ స్థానాలు గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో కౌన్సిల్ సభ్యులు రేణయ్య, గణేష్, హమీద్, కమల, కృష్ణ, ఆంజనేయులు, జ్యోతి, గోవిందు, అనిల్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ లేనివారిపై చర్యలు తీసుకోవాలి

కొల్లాపూర్ : కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో రేషన్ దుకాణాల ద్వారా అమలవుతున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులకు ప్రొటోకాల్ లేని కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారని, అలాంటి వారిపై, సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కాడం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కేతూరి నారాయణ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం ఆర్డీవో భన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా నాయకులు తమటం సాయికృష్ణ గౌడ్ మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి అర్హత లేని కాంగ్రెస్ నాయకులు పాల్గొనడం సరికాదని అన్నారు. రేషన్ షాపుల్లో ప్రధాని నరేంద్రమోదీ ఫొటో తప్పనిసరిగా ప్రదర్శించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు తమటం శేఖర్ గౌడ్, కడ్తాల కృష్ణ, ఇరగదిండ్ల పరమేష్, గడ్డం శ్రీరామ్, శేఖర్ రావు, రమేష్, కల్పన రెడ్డి, రమేష్, భాస్కర్ గౌడ్, జగపతి రావు, ఆవుల చందు, నవీన్, పాండు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు

అమ్రాబాద్ : కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా కార్యదర్శి కుందేళ్ళ సైదులు విమర్శించారు. ఈ విధానాలపై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. మండల కేంద్రంలోని ఎంకెగార్డెన్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు గోలిరాజు అధ్యక్షతన శుక్రవారం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రతీ కార్యకర్త చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగరాజు, మల్లేష్, చంద్రయ్యగౌడ్, శ్రీనివాసులు, వెంకటేష్, సందీప్ ఉన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



డీఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న ముస్లిం నాయకులు

అచ్చంపేటటౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీల హక్కులకు ముప్పుగా భావించే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాసులును కలిసి వనతిపత్రం అందజేశారు. ఈ సందర్భం గా ముస్లిం మైనార్టీ నాయకులు కరీం మాట్లాడుతూ మైనారిటీల హక్కులకు ముప్పుగా భావించే వక్ఫ్ బోర్డు బిల్లుకు ప్రతిపాదిత సవరణలకు వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతా మన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కరీం, మన్సూర్, ఇషాక్, ఖాజా, అమీన్, మహబూబ్‌అలీ, ఉస్మాన్ ఉన్నారు.

విలీన గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

- సీపీఎం ఆధ్వర్యంలో మునిసిపల్ మేనేజరుకు వినతి



పెంట్లవెల్లిలో తహసీల్దార్ జయసింహకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో విలీన గ్రామం దేశిటిక్యాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మునిసిపల్ మేనేజరుకు వినతిపత్ర అందజేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అశోక్ మాట్లాడుతూ మునిసిపాలిటీ పరిధిలోని దేశిటిక్యాలలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు పూర్తి స్థాయిలో లేవని, సామర్థ్యానికి సరిపడా ట్రాన్స్‌ఫార్మర్ లేక విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. సీపీఎం నాయకులు శ్రీనివాస్, మల్లేష్, రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

పెంట్లవెల్లి : ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెంట్లవెల్లి మండల పరిధిలోని జటప్రోలు, గోప్లాపూర్, ఎంగంపల్లితండా, మాధవస్వామినగర్ గ్రామాలలో ప్రభుత్వ భూమి ఉన్నా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. అదే విధంగా పెంట్లవెల్లిలో పేదల కోసం కొన్న ఇళ్ల స్థలాన్ని వారి కోసమే పంచాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు తిమ్మస్వామి, మద్దిలేటి, పెంటయ్య, గోవిందమ్మ, నాగమణి, గుండమ్మ పాల్గొన్నారు.